సేవకుడిగా వస్తున్నా.. ఆశీర్వదించండి: ఈటల



పెద్దచెరువు వద్ద వాకర్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

మన్సూరాబాద్: 'నాయకుడిగా కాదు.. మల్కాజిగిరి పార్లమెంట్ ప్రజల సేవకుడిగా మీ ముందుకు వస్తున్నా.. ఆశీర్వదించండి' అని మాజీ మంత్రి, మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మార్నింగ్ వాక్ చేపట్టి మన్సూరాబాద్‌లోని పెద్దచెరువు వాకర్స్‌ను, సహారాస్టేట్స్ కాలనీవాసులను ఈటల రాజేందర్ కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, ''నాపై దేశ ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా.. సేవకుడిగా పనిచేస్తున్నానని'' ప్రధాని మోదీ పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. దేశం సురక్షితంగా ఉండాలంటే బీజేపీని గెలిపించి మోదీని మరోసారి ప్రధానిని చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ ఎల్‌బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, నాయకులు కడియం రాంచంద్రయ్య, గంగదాసు కృష్ణారెడ్డి, చిల్కూరి మాధవి తదితరులు పాల్గొన్నారు.

15,16 తేదీల్లో 'తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం' జాతీయ సదస్సు



ఏసీపీ కాశిరెడ్డికి సదస్సు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో 'తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం – సమాలోచన' అనే అంశంపై రెండు రోజులపాటు తెలుగు జాతీయ సదస్సు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సు సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సదస్సు నిర్వహణకు సహకరిస్తున్న నక్క శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి వనస్థలిపురం ఏసీపీ పి.కాశిరెడ్డి, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణలకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలు, ఇతర కళాశాలల నుంచి ఎందరో అధ్యాపకులు సదస్సులో పాల్గొని పత్ర సమర్పణ చేస్తారని వారు తెలిపారు. సన్నాహక కార్యక్రమాలలో డా.కె.సురేష్, డా.చింతల రాకేష్ భవానీ, డా.గంజి శశిధర్, డా.బి.రవీందర్, డా.టి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరు

నాగోలు: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం నాగోలు డివిజన్ పరిధిలోని మన్సూరాబాద్ వాబే కాలనీలో ఏర్పాటు చేసిన సీపీఐ పార్టీ కార్యాలయాన్ని రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ, పార్టీ డివిజన్ కార్యదర్శి కందుల సుధాకర్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్రచారి మాట్లాడుతూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే తమ పార్టీకి ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రజల మద్దతు లభిస్తోందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వాంబే కాలనీ సీపీఐ శాఖ కార్యదర్శి పూజారి అనిత, భరత్ నగర్ శాఖ కార్యదర్శి గంగాధర శ్రీనివాస్, మన్సూరాబాద్ శాఖ కార్యదర్శి మీసాల స్వామి, సహాయ కార్యదర్శి కట్ట పార్వతమ్మ, శోభ, లింగన్న నాయకులు రమేష్, నర్రా శ్రీను, యాదన్న తదితరులు పాల్గొన్నారు.



వాబే కాలనీలో సీపీఐ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రవీంద్రచారి తదితరులు

కల్యాణ.. వైభోగమే

- ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం
- తరలివచ్చిన భక్తజనం

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో శ్రీరేణుకా ఎల్లమ్మ దేవతా కల్యాణం, బోనాల జాతర మంగళవారం వైభవంగా జరిగాయి. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11:30 నిమిషాలకు తదియ రేవతి నక్షత్రయుక్తమున వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారి కల్యాణం నిర్వహించారు. భజనలు, భక్తి గీతాలు ఆలపించి భక్తులను అలరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, ట్రస్టీ మురళీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లేష్ యాదవ్, అరుణ, మాజీ ఉప సర్పంచ్ నర్సింహ యాదవ్, కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు జాన్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్, రాఘవేందర్ గౌడ్, రాజు యాదవ్, కృష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ మురళీధర్‌రెడ్డి దంపతులు



హాజరైన భక్తులు

సీసీ కెమెరాలు, బయోమెట్రిక్‌లు వద్దు

వెంగళరావునగర్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ సెంటర్లలో టీచర్లు, హెల్పర్లు నిరంతరం చెమటోడ్చి విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వానికి ఏ మాత్రం కనికరం లేదని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో సీసీలు, బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలంటూ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు మంగళవారం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమాని ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయలక్ష్మి మాట్లాడుతూ సీసీలు, బయోమెట్రిక్ ఏర్పాటు చేయడమంటే తమను దొంగల్లా ప్రభుత్వం చూడటమేనని, ఇది సహించలేని విషయమన్నారు. మారుమూల ప్రాంతంలో అంగన్‌వాడీ టీచర్లు, లేకపోతే హెల్పర్లు ఒకరిద్దరు సకాలంలో విధులకు హాజరు కాకపోతే ప్రతి ఒక్కరినీ అనుమానంగా చూడటం అవమానించినట్లేనని అన్నారు. తప్పు చేయనివారిపై చర్యలు తీసుకోవాలని చూస్తే సహించేది లేదని, ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా సీసీ కెమెరాల ఏర్పాటును విరమించుకోవాలని కోరారు. యూనియన్ నేతలు కవిత, లక్ష్మితోపాటు వందలాది మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేస్తున్నాం

జీఎస్ఐ ఏడీజీ వెంకటేశ్వరరావు

మన్సూరాబాద్: భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లను సకాలంలో అమలు చేస్తున్నామని జీఎస్ఐ అడిషనల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సదరన్ రీజియన్ త్రైమాసిక సమావేశం మంగళవారం జీఎస్ఐలో నిర్వహించారు. సమావేశానికి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, జీఎస్ఐలో రిజర్వేషన్లు రోస్టర్ ప్రకారం కచ్చితంగా అమలు చేస్తున్నామన్నారు. జీఎస్ఐలోని అన్ని శాఖల ప్రమోషన్ కమిటీలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అసోసియేషన్ నేతలు ఆదర్శ మహేష్, మధిర సత్యనారాయణ కోరారు. అనంతరం ఏడీజీ వెంకటేశ్వరరావును అసోసియేషన్ నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు హార్మోహన్ మిశ్రా, అనూప్ ఎన్ కాంబ్లే, అసిస్టెంట్ డైరెక్టర్ రాజగోపాల్, అసోసియేషన్ నేతలు కబీరాజ్ సేతి, లింగ్యా, శ్రీనివాసరావు, రాజశేఖర్, కిషోర్‌కుమార్, చక్రేశ్వర్, మేఘరాజ్, విజయలక్ష్మి, అమరనాథ్, రాజా తదితరులు పాల్గొన్నారు.



ఏడీజీని సత్కరిస్తున్న అసోసియేషన్ నేతలు

ప్రజావాణి ఫిర్యాదుల్లో.. టౌన్‌ప్లానింగ్‌పైనే అధికం

రెండవ స్థానంలో ఇంజనీరింగ్ • 3వ స్థానం శానిటేషన్



ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయం



జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ (ఫైల్)

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ విభాగంపైనే ఎక్కువగా ఫిర్యాదు వస్తున్నాయి. ఆ విభాగం అధికారులు విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణం. డివిజన్లలో భవన నిర్మాణదారులు ఇబ్బడి ముబ్బడిగా అక్రమ నిర్మాణాలు చేపట్టడం ఒక ఎత్తు అయితే.. ఇంటి ముందు రోడ్లను ఆక్రమించి ర్యాంపులు నిర్మించడం మరో ఎత్తుగా మారింది. టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను, ర్యాంపులను పూర్తి స్థాయిలో అరికట్టలేకపోవడంతోనే రోజు రోజుకూ ఆయా సర్కిళ్లలో టౌన్ ప్లానింగ్ విభాగంపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. ఫిర్యాదులు అందుతున్న విభాగాల్లో రెండవ స్థానంలో ఇంజనీరింగ్ ఉంటే... మూడో స్థానంలో శానిటేషన్ ఉంది. జనవరి 8 నుంచి ఈనెల 11వరకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో 192 ఫిర్యాదులు వస్తే ఇందులో సగానికి పైగా టౌన్ ప్లానింగ్‌పైనే రావడం గమనార్హం!

సర్కిల్ వారీగా ఫిర్యాదుల వివరాలు ఇలా..

ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో ఇప్పటి వరకు 9 సార్లు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఐదు సర్కిళ్లు కలిపి ఇప్పటి వరకు 192 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 100కుపైగా టౌన్ ప్లానింగ్ విభాగంపైనే రావడం గమనార్హం. ఇంజనీరింగ్ విభాగంపై 60కుపైగా ఫిర్యాదులు వచ్చాయి. మిగతావి శానిటేషన్, ఇతర విభాగాలకు చెందినవి.

- జోనల్ కార్యాయంలో వచ్చిన మొత్తం ఫిర్యాదులు 72
- కాప్రాలో సర్కిల్‌లో వచ్చిన ఫిర్యాదు 18
- ఉప్పల్‌లో వచ్చిన ఫిర్యాదులు 27
- ఎల్‌బీనగర్ సర్కిల్–3లో వచ్చిన ఫిర్యాదులు 17
- ఎల్‌బీనగర్ సర్కిల్–4లో వచ్చిన ఫిర్యాదులు 10
- ఎల్‌బీనగర్ సర్కిల్–5లో వచ్చిన ఫిర్యాదులు 21

తీసుకున్న చర్యలు నామమాత్రమే ..

ఇప్పటి వరకు ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యలు నామమాత్రమేనని ప్రజలు విమర్శిస్తున్నారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలపై వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని పలువురు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇక శానిటేషన్ ఇతర విభాగంపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే అధికారులు పరిష్కరించారని ఆయా సర్కిల్ అధికారులు తెలిపారు.

పేదింటి యువతి పెళ్లికి చేయూత

నాగోలు: పేదలకు ఉప్పల ఫౌండేషన్ నిరంతరం చేయూత అందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఎల్‌బీనగర్‌కు చెందిన నిరుపేద యువతి మంజుల వివాహం కోసం మంగళవారం నాగోలులోని తన నివాసంలో శ్రీనివాస్ గుప్తా ఫౌండేషన్ ద్వారా పుస్తె, మెట్టెలు, చీర, గాజులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెళ్లి కూతురి బంధువులు సంతోష్‌కుమార్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి కటకం శ్రీనివాస్, యువజన కోశాధికారి నరేష్ గుప్తా, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా రఘువీర్‌రెడ్డి



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పి.రఘువీర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన పి.శివచంద్ర బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న 1998 బ్యాచ్‌కు చెందిన పి.రఘువీర్‌రెడ్డి సంతోష్‌నగర్‌కు బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రఘువీర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థుల్లోని నైపుణ్యం వెలికి తీయాలి

రామంతాపూర్: శ్రీనగర్ కాలనీలోని ఎస్వీ గ్రామర్ హైస్కూల్‌లో విద్యార్థులచే ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లను మంగళవారం కార్పొరేటర్లు బండారు శ్రీవాణి వెంకట్‌రావు, కక్కిరేణి చేతన హరీష్ ప్రారంభించారు. అనంతరం వారు ప్రతి విద్యార్థుల్లో నైపుణ్యం, ప్రతిభ దాగి ఉంటాయని, వాటిని వెలికి తీయడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. వంటకాలు.. ఆహా ఏమి రుచి అన్నట్లుగా రుచి, కమ్మని సువాసనలతో ఉన్నాయని పేర్కొన్నారు. కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులకు ఆహార పదార్థాలపై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ వసుంధర ఎర్రం శ్రీనివాసులు పాల్గొన్నారు.

లక్ష్యం రూ.47 కోట్లు.. బకాయిలు రూ.100 కోట్లు

31లోపు చెల్లించిన వారికి పెనాల్టీలో 90 శాతం రద్దు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో జీహెచ్ఎంసీకి ఆస్తి పన్ను బకాయి ఉన్న వారు ఈ నెల 31లోపు చెల్లించాలని, లేనిపక్షంలో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు తెలిపారు. మీ ప్రాంతంలో మరిన్ని సదుపాయాలు కల్పించాలంటే స్థిరాస్తి వ్యాపారులు వెంటనే బకాయిలను చెల్లించాలన్నారు. ఈ నెల 31లోపు చెల్లించిన వారిగా పెనాల్టీలో 90 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. గతేడాది రూ.34.46 కోట్ల వరకు వసూలు చేశామని, ఈ సంవత్సరం దాదాపు రూ.47 కోట్ల వరకు వసూలు చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే రూ.26 కోట్ల వరకు చెల్లింపులు జరిగాయన్నారు. ఇప్పటికి ఉప్పల్ సర్కిల్ పరిధిలో దాదాపు రూ.100 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి, పున్న నిర్మల గణేష్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి పున్న నిర్మల గణేష్ జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైనా టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి హాజరై నిర్మలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. నాయకులు రాష్ట్ర ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ బండి మధుసూదన్ రావు, తలాటి రమేష్ నేత, నల్లంకి ధనరాజ్ గౌడ్, జెల్లా జగన్నాథం, గద్దం లక్ష్మీనారాయణ, కౌకుంట్ల రవితేజ, దుర్గాప్రసాద్, రేణుక, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలి

చంపాపేట: విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికుమార్ అన్నారు. ఇంజాపూర్ బ్లాక్ బోర్డ్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని మంగళవారం చంపాపేటలోని మినీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కెనరా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ సుధీర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వెస్టర్న్, శాస్త్రీయ నృత్యాలు ఆహూతులను కట్టిపడేశాయి. కార్యక్రమంలో నాయకులు ధనరాజ్‌గౌడ్, వెంకట్‌నాయక్, వెంకన్న, పాఠశాల కరస్పాండెంట్ రామ్‌లాల్‌నాయక్, ప్రిన్సిపాల్ ప్రవల్లిక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రవికుమార్, పాఠశాల నిర్వాహకులు

బోనాల నిధులు మాయం చేశారు

మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్



రోడ్ల దుస్థితిని అధికారులకు చూపిస్తున్న సహదేవ్‌యాదవ్

చంచల్‌గూడ: 2023 బోనాల నిధులను అధికారులు, కాంట్రాక్టర్లు మాయం చేశారని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, కుర్మగూడ మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ ఆరోపించారు. మంగళవారం ఆయన జీహెచ్ఎంసీ అధికారులను పిలిపించి రోడ్ల దుస్థితిని చూపించారు. అభివృద్ధి పనులు మంజూరై నెలలు అవుతున్నా పనులు మొదలు కాకపోడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. సాయిలాల్‌తోట, భరత్‌నగర్ బస్తీలో కొత్త రోడ్ల వేయడానికి నిధులు మంజూరైనా అధికారుల నిర్లక్ష్యం వల్ల కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టలేదని ఆయన విమర్శించారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి: సామ

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్‌లోని పలు డివిజన్లలో బూత్ స్థాయినుంచి బీజేపీని మరింత బలోపేతం చేసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీ గెలిపించాల్సిన బాధ్యత పార్టీ క్రియాశీలక కార్యకర్తలపై ఉందని జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. మంగళవారం బీఎన్‌రెడ్డి నగర్ కాలనీలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బూత్ స్థాయి బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా మాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వనపల్లి శ్రీనివాస్, నాయకులు విష్ణువర్ధన్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

విజయ సంకల్ప సభకు తరలిన నాయకులు

నాగోలు: ఎల్‌బీ స్టేడియంలో మంగళవారం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా నిర్వహించిన విజయ సంకల్ప సభకు కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు బీజేపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ, దేశంలో మరోసారి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంతో బీజేపీ అధికారంలో వస్తుందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.



నిరుద్యోగుల నిరాహార దీక్షకు సంఘీభావం



నిరుద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న కృష్ణయ్య, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

చైతన్యపురి: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో చైతన్యపురిలో మూడు రోజులుగా కొందరు నిరుద్యోగులు నిరాహార దీక్ష చేస్తున్నారు. జీఓ 46 రద్దు చేయాలని, గ్రూప్ పోస్టులు పెంచాలని, టెట్ నిర్వహించాలనే డిమాండ్‌తో దీక్ష చేపట్టగా...వీరికి మంగళవారం రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. దీక్ష చేస్తున్న అశోక్, ఇతర నిరుద్యోగులను పరామర్శించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లపై దీక్ష చేస్తున్న ని రుద్యోగులను ప్రభుత్వం పట్టించుకోకపోవటం దుర్మార్గమన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే తాము కూడా ఆందోళ చేపడతామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, పలువురు బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు



వేడుకల్లో పాల్గొన్న మహిళలు

చంచల్‌గూడ: మారుతున్న కాలంతో పాటు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ప్రముఖ నాట్య కళాకారిణి డాక్టర్ సురభి శారదా లక్ష్మి అన్నారు. మంగళవారం ఐఎస్ సదన్ డివిజన్‌లో గల వైఎస్ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్, హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆఫ్ ఇండియా సంస్థల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు సాధించిన విజయాలను బాలికలు, యువతులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న బాలికలు, మహిళలకు బిరుదలతో సత్కరించారు. సంస్థల ప్రతినిధులు కామేశ్వరి, రమణి, నిధి తదితరులున్నారు.

మూసీ నాలాలో దిగిన బాలుడిని కాపాడిన స్థానికులు

చాదర్‌ఘాట్: మూసీ నాలాలో అనుమానాస్పద స్థితిలో ఉన్న ఓ బాలుడిని స్థానికులు బయటకు తీసి చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆజంపురా ప్రాంతానికి చెందిన జోహేబ్ హందాన్(9) మంగళవారం మూసానగర్ పరీవాహక ప్రాంతమైన మూసీ నాలాలో దిగాడు. అక్కడే ఉన్న స్థానికులు గుర్తించి బాలుడిని బయటకు తీసి సపర్యాలు చేసి పోలీసులకు అప్పగించారు. అదే సమయంలో జోహేబ్ కనిపించడం లేదని ఫిర్యాదు చేసేందుకు చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాలుడి తాత ఎంఏ జబ్బార్ అక్కడే ఉండటంతో బాలుడిని అప్పగించారు. సమయ స్ఫూర్తితో వ్యవహరించి బాలుడిని పెను ప్రమాదం నుంచి కాపాడిన స్థానికులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

'శ్రీ చైతన్య' లో ఘనంగా ఫ్యామిలీ ఫెస్ట్



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

ఎల్బీనగర్: గాయత్రీ నగర్ లోని శ్రీ చైతన్య స్కూల్ లో ఫ్యామిలీ ఫెస్ట్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం సతీష్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు పెరుగుతాయని అన్నారు. తల్లిదండ్రులు, పెద్దలు, గురువుల పట్ల విద్యార్థుల్లో గౌరవ మర్యాదలు పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ ఫణి మాధవి పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, గ్రాండ్ పేరెంట్స్‌కు పాదపూజ చేశారు. ఆర్ఐ రవీందర్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ రఘువంశీ, డీన్ వెంకటేష్, ఏఓ భాస్కర్, ప్రైమరీ ఇన్‌చార్జి అతియా, సీ బ్యాచ్ ఇన్‌చార్జి శరత్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 11, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి 60, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 25, క్యారెట్ 23. దొండ 28, ఆలు 27, ఉల్లి 24, గోకర 45, దోస 19, సొర 09, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 60, అర్వి 47, మునగ 45, చిలగడదుంప 65. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

గల్ఫ్ దేశాల్లో పెట్టుబడి పేరుతో మోసం

ఐదుగురిపై కేసు

గౌలిపురా: తమ వ్యాపారంలో డబ్బులు పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పి మోసానికి పాల్పడిన ఐదుగురిపై మొఘల్‌పురా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గాప్రసాద్ వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన ఫరీసా బిన్ అవద్, రయీసాబిన్ అవద్, మహ్మద్ బిన్ సలాం, సలాం బిన్ అబ్దుల్లా, అబూద్ బిన్ అవద్ గ్రూపుగా ఏర్పడి తాము గల్ఫ్ దేశాల్లో కార్ రెంటల్స్, రియల్ ఎస్టేట్, మాంసం ఎగుమతి తదితర వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారు. తమ వ్యాపారాల్లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయంటూ ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారు. మొఘల్‌పురా ప్రాంతానికి చెందిన రుబీనా సుల్తానా (35)ను కలిసి తమ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే లాభాలను వస్తాయని నమ్మించడంతో ఆమె తనతో పాటు తల్లి సలేహా సుల్తానా, భర్త సైఫ్ సలా హద్రమీ అకౌంట్ల నుంచి పలు రూ.25.20 లక్షలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించింది. తమ డబ్బు గురించి ప్రశ్నించగా సలాం బిన్ అబ్దుల్లా, అబూద్ బిన్ అవద్ గల్ఫ్ దేశాల్లో ఉన్నట్లు ఫోన్‌లో మాట్లాడించేవారు. కొన్ని రోజుల తర్వాత ఫరీసా, అబూద్ పేరుపై చెక్కులు రుబీనా సుల్తానాకు అందజేశారు. గతేడాది ఫిబ్రవరిలో రూ.15 లక్షలు విత్‌డ్రా చేయగా అందులో తగినంత డబ్బులు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయ్యింది. మోసపోయినట్లు గ్రహించి బాధితురాలు మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.